# 11

డా॥ ధేనువకొండ శ్రీరామమూర్తి



# ‘పశుర్వేత్తి’

గడచిన కాలంస్మృతులు వర్తమాన కాలంలో యింకిపోతూ వుంటాయి. అంతర్గతంగా శాసిస్తుంటాయి. అనుభవానికి అంత నియత. మన ప్రమేయం వున్నా లేకున్నా నడుస్తూ ప్రవాహంలా జరుగుతుంది. ప్రవాహపు వొరవడి తీవ్రంగా వుండవచ్చు. సౌమ్యంగా వుండవచ్చు.

సందర్భం; సాంగత్యం, సాన్నిహిత్యం శుభ్రమైనదైతే మామూలు మనుష్యులలో కూడా గొప్ప అభిరుచి. అభినివేశం వుంటాయేమో ! బంగారు సాహెబ్‌ను చూస్తే అనిపిస్తుంది.

మృదంగ విద్వాంసుడు  సూర్యం, బంగారు సాహెబ్ బాల్యమిత్రులు. బంగారు సాహెబ్‌కు గుర్రపుబండి జీవనాధారమైతే, సూరి కర్నాటక సంంగీతంలో ప్రసిద్ద సంగీత విద్వాంసుడు అయినాడు. ఆ ప్రాంతంలో జరిగే ప్రసిద్ధ సంగీత విద్వాంసుల కచేరీలకు వాద్య సహకారం ఆయనది తప్పనిసరి.

ఎన్ని అవకాశాలు వచ్చినా కాదని తన సొంత గ్రామంలోనే నివాసం ఏర్పరచుకొన్నారు. అది మారుమూల గ్రామం. ట్రంకు రోడ్డుకు ఐదు కిలోమీటర్ల దూరంలో వుండే ‘గుండ్లకమ్మ’ నదినిదాటి అవతలి ఒడ్డున అతని గ్రామం. కచేరీకి వెళ్ళే సమయంలో ఈ దారంట బంగారు సాహెబ్ గుర్రం బండి సహకారం ‘సూరి’కి తప్పనిసరి.

బంగారు సాహెబ్ బండితోలుతూ ‘ధక్ ధక్’తో, గొంతులోంచి మధురనాదం లయాత్మకంగా మొదలువుతుంది. మట్టిరోడ్డు మీద చిన్న చిన్న కుదుపులతో చెర్నకోలకర్రకు బండి చక్రం ఆకులకు తాకిస్తూ లయాత్మక శబ్దంతో గుర్రాన్ని ఉత్సాహపరుస్తుంటాడు. మధ్యలో సూర్యం ‘తక్, తధికిట, తధింగిణతోం’ జాతి దరువుల కదలికలై నాలిక నర్తిస్తూ సూర్యం గాత్రం పరవశించి పోతుంది.

గుండ్లకమ్మనది, నదిలో ఇసుకతిన్నెలు, చల్లటి చీకటి ఏదో దీర్ఘశ్వాసలా లయగా లయగా శబ్దంలేని నదీ ప్రవాహంలో అతని గాత్రం మధురనాదంలో చుట్టూ మహోత్కృష్ట ప్రకృతి కాలం, కొంచెం సేపు స్పృహ

కోల్పోతుంది.

జ్ఞానధాతువుల నిమిత్తం లేదు. తెలియని తనపు మహోన్నతతలో ఈదులాడుతారు. ఏదో పురాతన లిప్పు గుబాళిస్తుంది.

'సూర్యం' తన గురువుగారి వూరినే స్వగ్రామం చేసుకున్నాడు. సుబ్బారావుపంతులు సంగీతగురువు. ఏడెనిమిది మంది శిష్యులతో గురుకులవాసం. భోజనాదికాలకు నిత్యం పది పదిహేను మంది వుండేవారు.

వెచ్చాలు, కూరలు, ఇంట్లో ఖర్చులు అన్నీ శిష్యులే జాగ్రత్తగా చూసుకుంటుంటారు. ఎట్లావొనకూడేవో కొంచెం ఆశ్చర్యంగానే ఉండేది. కొందరు కొందరు వచ్చి అడిగినట్లు ఇచ్చి వెళ్ళేవారు.

చిన్నతనం నుండి సంగీతాభ్యాసం వలన స్వరసంపుటిలో మంచిగమకం చేర్చడంలో విలక్షనంగా వినసొంపుగా వుండేది గాత్రం.

జూనియర్ అభ్యాసకులకు సరళీ స్వరాలు పిళ్ళారి గీతాలు సూర్యం నేర్పేవాడు.

నాదానందానుభూతి నుండి పంతులుగారు తేరుకొని ఎప్పుడు పాఠం మొదలెట్టారా అని శిష్యులు ఎదురు చూస్తుండేవారు.

శ్రీరాగంలో "ఎందరో మహానుభావులు" మొదలెట్టిన సుబ్బారావు పంతులుగారు "అందుకోరా" అనేవారు. సూర్యం మృదంగం వాయిస్తూ కూడా సహకారగానం చేసేవారు. మిగతా శిష్యులు చుట్టూకూర్చొని ఆయన గాత్రంలో కలిసి సాధనలో పాఠం నేర్చుకొనేవారు.

సుబ్బారావు పంతులు వంశీయులు గొప్ప సంగీత విద్వాంసులు, గుంటూరు ఒంగోలు ప్రాంతంలో ఎందరో నట్టువరాండ్రకు శాస్త్రీయ సంగీతం నేర్పారు. తరంగ గానానికి ప్రసిద్ధులైనారు. వీరు జావళి, లావణి, బాణీలతో హరికథా, భాగవతాభినయాలను ప్రదర్శించేవారు.

ప్రతిరోజు నాలుగు గంటల సేపు సంగీత సాధన ప్రతినిత్యము చేస్తుంటారు. సాధన చేస్తుంటే సంగీత సభలో గానం చేస్తున్నట్లు వుంటుంది. కొందరక్కడకు చేరి విని ఆనందించేవారు. కొందరు ఇంకా వీరికి సాధన ఏమిటి? అని పెదవి విరిచేవారు.

అది తపస్సమాధి, అది ఏకాగ్రత.

ఖరహర ప్రియరాగంలో "రామానీ సమానమెవ్వరు" లయాత్మకగానం ఆత్మానందానికి మాత్రమే!

దేశంలో ఏ విద్య ప్రాచుర్యంలోకి రావాలన్నా, ఆ విద్యకు సంబంధించిన కళాత్మక విభాగం, జనులకు పరిచయం అయివుండాలి. అందుకోసం ఆ విద్యలో ప్రవీణులయిన వారు బాగా ప్రాచుర్యానికి పూనుకోవాలి.

సాయుజ్యము పునర్జన్మ రాహిత్యము కలుగుతాయంటారు. అదిగో ఆవిధమైన సంస్కార పూరిత సాధనలోనే అవి నెరవేరుతాయి. ఆ నాదానుభూతిలోనే బొమ్మరాజు సీతారామదాసు "పూరయమమకామం" తరంగ గానం చేస్తూ సాయుజ్యం పొందారు.

అదే వొరవడిలో సుబ్బారావుగారు కాలం చేసేక 'సూర్యం' గురుకుల బాధ్యత నెరవేరుస్తున్నారు.

'సూర్యం' నీకు సంగీతం ప్రాక్తన జన్మ విద్యరా!' అని మెచ్చుకొనేవారు. పాల్ నమస్కారం చేసి వినయంగా పక్కకు జరిగివెళ్ళేవాడు.

సూర్యం మృదంగ నాదం చాలా సొంపుగా వుండేది. తని కమ్మదనం ఆ వేళ్ళలోంచి ధ్వనించేది. వాయులీనం కూడా అంతే సొగసుగా వినిపించేవాడు.

సుబ్బారావు పంతులు 'సూర్యం' పట్ల ప్రత్యేక అభిమానం చూపిస్తున్నట్లుగా వుండేది.

ఎప్పుడైనా శృతి భంగమయితే "నాన్నా" అని హెచ్చరించేవారు. ఆయన వెంటనే సవరించుకొనే వాడు ఇతర శిష్యులను కళ్ళు పెద్దవిచేసి హుంకరిస్తుండేవారు.

కృష్ణలీలా తరంగిణిగానిస్తుంటే ఎల్లలులేని ఆయన రసహృదయపు ఔన్నత్యం ఒక సౌందర్యపు శకలంలా మనస్సుల్ని తాకి వివశుల్ని చేసేది. ప్రణయతత్వంలోని ఔన్నత్యమే తాదాత్మ్యమై ఉద్వేగం, ప్రేమమయమై స్వచ్ఛమైన మధురిమను విరజిమ్ముతుంది.

× × ×

కాలగమనంలో సాంఘిక ధార్మిక విలువల్లో మార్పువచ్చినట్లే మనుషుల వ్యక్తిత్వాలలో మార్పు కనబడుతోంది.

విద్వాంసుని స్థాయిని బట్టి వాద్యసహకారం కార్యక్రమం సూర్యం వొప్పుకోవడం జరుగుతుండేది.

చాలామంది తమలో లోపాలు వున్నాయని గమనించరు. తమది చాలా ప్రత్యేకమయిన వ్యక్తిత్వంగా భావిస్తారు. కార్యక్రమాలు విరివిగా వుండటంలో సాధన లుప్తమయింది. కళాకారులను ఆశ్రయించి వుంటాయి కళలు.

అల్పత్వం, అహం, స్వాతిశయం మనస్సులో ఏర్పడినప్పుడు ఆత్మిక అమరత్వం అనంతశక్తి కోల్పోవడం ప్రారంభం అవుతుంది.

త్యాగరాజు ఉత్సవాలు ఒంగోలు, చీరాల, బాపట్ల పట్టణాలలో ఘనంగా ఏర్పాటవుతాయి. ప్రసిద్ధ విద్వాంసులు తప్పక వచ్చి అక్కడ కచేరీలు చేసి వెళ్ళటం, గౌరవంగా భావిస్తారు.

ఆనాటి కచేరీకి రావలసిన పెద్ద విద్వాంసుడు అనివార్య కారణం వలన రాలేదని తెలిసింది. హడావుడిగా ఆయన స్థానంలో నిర్వాహకులు స్థానిక విద్వాంసుడు శేషయ్యగారి కచేరీ ఏర్పాటు చేసుకున్నారు. వేషభాషలు లేని నిరాడంబరుడు శేషయ్య. స్థానికుడైనందున అందరిలో చులకనభావం.

బ్రహ్మంగారి వీధిలో అరుగులపై పేపరు చదువుతూ అమాయకంగా ప్రజ్ఞలేని విధంగా వుండేవాడు శేషయ్య.

అటువంటి శేషయ్యకు తన వాద్య సహకారమేంటి? సూర్యం అహం దెబ్బతింది.

మరునాటి కార్యక్రమానికి మహావాది, నాగభూషణం లాంటి ఉద్దండ పండితులు ఈరోజే వస్తున్నారని కార్యక్రమం భంగం ఉండరాదని త్యాగరాజ సేవగా భావించి సహకరించాలని నిర్వాహకులు సూర్యాన్ని బ్రతిమలాడారు. బలవంతం మీద 'సూర్యం' అంగీకరించారు.

నిర్వాహకులు ఊపిరి పీల్చుకున్నారు.

శేషయ్య గాత్ర కచేరీ మొదలయింది. సూర్యం మృదంగం పక్క వాయిద్యం. ప్రేక్షకులలో హేమాహేమీలు ఆశయ సూత్రాలు.

తాళం వేయకుండా శేషయ్యగారు పల్లవి పాడటం మొదలెట్టారు.

సూర్యానికి తాళం స్ఫురించలేదు.

తాళం వేసే వారి కొరకు ఒక క్షణం ఎదురుచూశాడు. ఎదురుగా వున్న మహావాది గారిని నాగభూషణం గారిని తాళం కోసం ప్రశ్నార్థకంగా సూర్యం చూశాడు.

వాళ్ళు నిర్లిప్తమై వున్నారు.

అందరిలో ఆసక్తి మొదలయ్యింది.

ఆవృతి పూర్తి అయ్యేసరికి 2 అక్షరాల జాగాలో తేడా రావడం జరిగింది.

బేల మొగంతో తలవంచుకున్నాడు సూర్యం.

నిశ్శబ్దం.

శేషయ్యగానం ఆపి

"మరో పదిరోజులు సమయం ఇస్తా సాధన చేసిరా! వాయిద్దువుగాని" అని అనుపల్లవి అందుకున్నాడు శేషయ్య.

మృదంగతిని సూర్యం వేళ్ళలో ఆగిపోయింది. మరి మ్రోగలేదు.